

హార్లిక్స్ ఫ్యాక్టరీలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బొమ్మూరులోని హిందుస్థాన్ యునిలివర్ లిమిటెడ్ హార్లిక్స్ ఫ్యాక్టరీలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పాల్గొన్నారు. కార్మిక హక్కులు, వివిధ కార్మిక చట్టాల గురించి వివరించారు. కార్మికులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పని చేయాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బిఎస్ఎం.వలీ పారిశ్రామిక వివాదాల చట్టం-1947, కనీస వేతనాల చట్టం-1948 వంటి వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఎస్.శ్రీనివాస రావు, ఫ్యాక్టరీ కార్మికులు, కార్మిక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పాదయాత్రకు సంఘీభావం తెలపండి

- తిరుమలాయపాలెం దళిత నాయకులపై కేసులు ఎత్తివేయాలి
- రాజమహేంద్రవరంలో అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ డిమాండ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పోలవరం నిర్వాసితుల పోరుకేక పేరుతో నిర్వహిస్తున్న మహా పాదయాత్రకు సంఘీభావం తెలపాలని, గోకవరం మండలం తిరుమలాయపాలెం ఘటన నేపథ్యంలో దళిత నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, రాజమహేంద్రవరం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలతో శ్వేత పత్రం విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుళ ప్రయోజనాలతో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారన్నారు. కాని నిర్వాసితులను మరిచారన్నారు. లక్ష ఆరువేల ఆరు కుటుంబాలు పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులు అవుతున్నారని తెలిపారు. అయితే నేటికి 14 వేల కుటుంబాలకు మాత్రమే పునరావాస పనులు వివిధ స్థాయిల్లో జరుగుతున్నాయన్నారు. మిగిలిన 98 వేల కుటుంబాలు, 2.5 లక్షల జనాభాకు ఎప్పుడు పునరావాసం పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనుల్లో భాగంగా స్పిల్ వే, గేట్లు, ఎగువ, దిగువ కాఫర్ డామ్లు, డయా ఫ్రం వాల్ నిర్మించారన్నారు. కాని పునరావాసం విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల కోసం పోరాడకుండా మోడీ ప్రభుత్వంతో జతకట్టి నిర్వాసితులను గోదావరిలో ముంచుతుందని విమర్శించారు. 2022 వరదలతో కాంటూరు లెక్కలు తప్పు అని తేలిపోయాయన్నారు. ముంపు ప్రాంత ప్రజలు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. దీని కోంస సిపిఎం ఆధ్వర్యంలో నిర్వాసితుల పోరుకేక పేరుతో మహా పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. ఈ పాదయాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వం వెయ్యిమంది యువతీ, యువకులు 15 రోజులు పాటు నెల్లిపాక గ్రామం నుండి విజయవాడ వరకు పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. పాదయాత్రకు విశేషమైన ఆదరణ ప్రజల నుంచి వస్తుందన్నారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు.

గోకవరం మండలం తిరుమలాయపాలెం వివాదంలో అధికార యంత్రాంగం సరైన పద్ధతి అవలంబించలేదన్నారు. అంబేద్కర్ విగ్రహం దళిత వాడల్లోనే నిర్మించాలా? అని ప్రశ్నించారు. ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని అర్ధ రాత్రి తొలగించారన్నారు. రెండు వందల మంది పోలీసులను మోహరించి ప్రశాంతంగా నిరసన తెలుపుతున్న దళిత నాయకులని అరెస్ట్ చేసి తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఖండించారు. కలెక్టరు కలిసి జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని కోరినా పోలీసుల తీరులో ఏ మాత్రం మార్పు లేదన్నారు. గ్రామంలో బాధితులను పరామర్శించడానికి, సహకారం అందించడానికి వెళ్తున్న దళిత నాయకులు, వామపక్ష నాయకులను పోలీసులు అడ్డగించి తప్పుడు కేసులు పెట్టారన్నారు. వెంటనే దళిత నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి అదే స్థలంలో ప్రభుత్వ అధికారులే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రాజమహేంద్రవరం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలతో మున్సిపల్ అధికారులు శ్వేతపత్రం విడుదల చేయాలని అరుణ్ డిమాండ్ చేశారు. అందుకు కారణం నగరంలో ప్రజలు 2022-2023 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.100 కోట్లు పన్నుల రూపంలో మున్సిపల్ కార్పొరేషన్కు చెల్లించారని తెలిపారు. నగరంలో సుందరీకరణ పేరుతో రోడ్డు మధ్యలో డివైడర్లు, ఫుట్ పాత్పై రాళ్లు వేస్తున్నారని, ఒక వీధిలో హ్యాపీ స్ట్రీట్ ఏర్పాటు చేశారన్నారు. కాని ప్రజలకు కనీస వసతులైన పారిశుధ్యం, రోడ్లు, తాగునీరు వంటివి నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. పనుల్లో ప్రాధాన్యతను పాటించకుండా ప్రజల ధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. సుందరీకరణకు ఖర్చు పెడుతున్న నిధులు ఎంపీ, కార్పొరేషన్, లేక రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక గ్రాంట్ అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. పనులు జరుగుతున్న చోట ఎక్కడ నిధులు తెలిపే బోర్డులు లేవన్నారు. చిన్న పాటి వర్షానికి రోడ్లు జలమయం అవుతున్నాయని, తక్షణం ఆ సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, ఐ.సుబ్రహ్మణ్యం, బి.పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వివేక్యాదవ్, కలెక్టర్ మాధవీలత

సంతృప్తికరంగా జగనన్న సురక్ష సర్వే

ప్రత్యేకాధికారి వివేక్యాదవ్

ప్రజాశక్తి - కడియం

జిల్లాలో జగనన్న సురక్ష సర్వే సంతృప్తికరంగా సాగుతుందని ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ కమిషనర్ వివేక్యాదవ్ అన్నారు. మంగళవారం కడియం మండలంలో జేగురుపాడు సచివాలయం, ఆర్బికె, అంగన్వాడీ కేంద్రం, హౌసింగ్ లే అవుట్, కడియంలో పిహెచ్సి కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతతో కలిసి పరిశీలించారు. జేగురుపాడు అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ వై.స్టాలిన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కింద గృహ సందర్శన సందర్భంలో వాలంటీర్ లబ్ధిదారుల నుంచి అన్ని వివరాలు తీసుకుంటున్నారన్నారు. ఆయా పథకాల అమలుపై లబ్ధిదారులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హత ఉండి పథకాలు పొందని లబ్ధిదారులను గుర్తించి వాటిని అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మండల స్థాయిలో రెండు బృందాలు, పురపాలక, నగరపాలక సంస్థ పరిధిలో రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టరు మాధవీలత తెలిపారు. మండల స్థాయితో పాటు డివిజన్ స్థాయిలో కూడా ప్రత్యేక అధికారులు నియమించి పర్యవేక్షణ చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే మురమండ పిహెచ్సిని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పిహెచ్సిలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాల సేవలను వివరించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో పోష్టికాహారం లోపాన్ని అధిగమించడంలో జిల్లా యంత్రాంగం నూతనంగా ప్రవేశపెట్టిన బంగారు కొండ కార్యక్రమం ఎంతో ఆసక్తి కలిగిస్తోందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రయోగాత్మకంగా బంగారు కొండ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహార అదనంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో ఆరు మాసాలు పాటు పోష్టికాహారపు కిట్లను చిన్నారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డిఒ చైత్రవర్షిణి, డిఎల్డిఒ మీనాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, డిఐఇ అబ్రహం, హౌసింగ్ పీడీ రాములు, డిఆర్డిఎ పీడీ సుభాషిణి, ఇన్ఛార్జి ఎంపిడిఒ కె.చంద్రరావు, తహశీల్దార్ సుజాత, ఎంఇఒ వి.లజపతిరాయ్ , తదితరులు ఉన్నారు.

భూ యజమానులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో భూములు కబ్జాకు గురవుతున్నాయని, భూ యజమానులు అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం తూర్పుమండలం డిఎస్పి కె.వెంకటేశ్వరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్స్టేషన్లో సిఐ పి.కాశీవిశ్వనాథ్, ఎస్ఐ సుధకర్తో కలిసి ఆయన మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరి భూమైనా కబ్జాకు గురైతే ఫిర్యాదు చేయాలన్నారు. హైదరాబాద్లో నివాసం ఉంటున్న పట్నాల ప్రసాద్ కొంతమూరులో స్థలం కొనుగోలు చేశారన్నారు. ఆయన స్థలాన్ని నకిలీ పత్రాలతో కొంత మంది రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 8 మందిని కోర్టులో హాజరుపర్చామన్నారు. మిగిలిన భూ యజమానులు అప్రమత్తంగా ఉండాలని, భూమికి కంచె వేసుకుని అడ్రస్ బోర్డులు పెట్టుకోవాలన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చాగల్లు

విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులు, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న చేపట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం చాగల్లు ప్రధాన కూడలి వద్ద ధర్నాకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల నాయకులు గారపాటి వెంకట సుబ్బారావు, సిపిఎం మండల కార్యదర్శి కామిశెట్టి దుర్గారావు మాట్లాడారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై అదనం 20శాతం రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కంకటాల బుద్ధుడు, కొడవటి వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు



కుమారుని మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు

అనుమానాస్పద స్థితిలో మెడికో మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం సమీపంలో జిఎస్ఎల్ మెడికల్ కళాశాల విద్యార్థి తెనాలికి చెందిన కొండూరి శ్రీకృష్ణకేదార్(27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కేదార్ పీజీ చదువుతూ హాస్టల్లో ఉంటున్నాడు. మెడికల్ కళాశాల ఎగ్జిక్యూటివ్ క్వార్టర్స్లో మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడు. వెంటనే యాజమాన్యం మృతుడి తండ్రి కొండూరి శివరామ లింగేశ్వర వరప్రసాద్కు సమాచారం అందించారు. వెంటనే ఆయన కుటుంబ సభ్యులతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుమారుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. తన కొడుకుని హత్య చేసి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తన కుమారుని శరీరంపై గాయాలున్నాయని, చొక్కా, ప్యాంటు చింపినట్టుగా ఉన్నాయని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలానికి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించాయి. డిఎస్పి వెంకటేశ్వరరావు, సిఐ పి.కాశీవిశ్వనాథ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

సమస్యలపై అంగన్వాడీల పోరుయాత్ర

ప్రజాశక్తి - గోకవరం, సీతానగరం, కొవ్వూరు

సమస్యలపై స్పందించకపోతే వైసిపి సర్కారుకు గుణపాఠం తప్పదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి హెచ్చరించారు. అంగన్వాడీల సమస్యలపై చేపట్టిన పోరుయాత్ర మంగళవారం సీతానగరం, గోకవరం, కొవ్వూరు మండలాల్లో సాగింది. గోకవరం దేవీచౌక్ వద్ద నిర్వహించిన సభలో బేబిరాణి మాట్లాడారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలన్నారు. ఐసిడిఎస్ను నిర్వీర్యం చేయాలని చూసే ఊరుకోబోమన్నారు. అంగన్వాడీలకు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఐసిడిఎస్ను నిర్వీర్యం చేసే కుట్రలను ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. చిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ వారి సమస్యలను మాత్రం పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. యాప్లు, ఇతర పనులతో అంగన్వాడీలపై పనిభారం పెరిగిపోయిందన్నారు. అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులను ఆపాలన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అన్నపూర్ణ మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మేటర్నరీ లీవ్ ఇవ్వాలన్నారు. ఈ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మాణిక్యాంబ, కె.బేబిరాణి, నాయకులు బి.మార్త, ఎం.మార్త, ఎం.మాలతి, వివిడి.లక్ష్మి, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **సీతానగరంలో** మండలం చినకొండేపూడిలో జరిగిన అంగన్వాడీల పోరుబాట సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబిరాణి మాట్లాడారు. మాట తప్పను మడమ తిప్పను అని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. **కొవ్వూరులో** జరిగిన సభకు కొవ్వూరు ప్రాజెక్ట్ అధ్యక్షులు సి.హెచ్.పుష్ప అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబిరాణి మాట్లాడారు. హెల్పర్లకు ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లు పెంచాలన్నారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. జులై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరవధిక ధర్నాను జయప్రదం చేయాలన్నారు. హెచ్.అన్నపూర్ణ, బి.మధురవల్లి, డి.అమరావతి, కె.దుర్గామణి, సిహెచ్.భవాని తదితరులు పాల్గొన్నారు.



గోకవరంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి



కొవ్వూరులో ....



సిస్టర్ జానెట్ను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

ప్రిన్సిపల్ జానెట్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - గోపాలపురం

పాఠశాల అభివృద్ధిలో, ఎందరో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ప్రిన్సిపల్ జానెట్ సేవలు మరువలేనివని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ జానెట్ ఉత్తరప్రదేశ్కు బదిలీపై వెళ్లడంతో వీడ్కోలు సభను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 28 ఏళ్ల పాటు జానెట్ సేవలు అందించారన్నారు. పాఠశాల అభివృద్ధిలో, ఉత్తీర్ణత శాతం సాధించడంలో అహర్నిశలు కష్టపడే వారన్నారు. క్రమశిక్షణ, విలువలు, సాంకేత పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించారన్నారు. పేదలకు, వికలాంగులకు, అంధులకు, లెప్రసీ బాధితులకు ఎన్నో విధాలుగా సాయం అందించారన్నారు. అనంతరం నూతన ప్రిన్సిపల్ సిస్టర్ సిల్వీ, పాఠశాల కరస్పాండెంట్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బదిలీపై వెళుతున్న సిస్టర్ జానెట్ను దుస్సాలువాలు, పూలమాలతో సత్కరించారు.

బంకిం చంద్ర చటర్జీకి నివాళి

ప్రజాశక్తి - తాళ్లపూడి

జాతీయ గీతం వందేమాతరంను రచించిన మహోన్నత వ్యక్తి బంకిం చంద్ర చటర్జీ అని రాగోల పల్లి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. వందేమాతర గీత రచయిత చటర్జీ జయంతి సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో బంకించంద్ర చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ చటర్జీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బొజ్జా తారకం జయంతి

కడియం : మండలంలోని పొట్టిలంకలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బొజ్జా తారకం 84వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఐ ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నంరాజు పాల్గొని బొజ్జా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు పంచారు. ఆయన మాట్లాడుతూ బొజ్జా అలుపెరుగని పోరాటయోధుడన్నారు. జీవిత కాలం పేదలపక్షాన నిలబడి న్యాయస్థానాల్లో పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అటువంటి మహనీయుడిని స్మరించుకోవడం బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా చంటిబాబు, ఆర్.యేసు, సతీష్, కొల్లాపు వీరన్న, యాళ్ల సురేష్, అంబటి అఖిల్, నెల్లి రాజేష్, బడుగు సత్తిబాబు, కోణాల లాజరు, ప్రసాద్, చిన్న, తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులకు సమగ్ర విద్య బోధన అందించాలి

గోకవరం : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సమగ్ర విద్య బోధన అందించాలని ఎంపిపి సుంకర శ్రీవల్లి అన్నారు. మంగళవారం గోకవరం హై స్కూల్లో పిఎంసి సమావేశం చైర్మన్ కణితి శ్రీనివాస్ అధ్యక్షతన హెచ్ఎం పిఎస్ఎన్.రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలకు ఖర్చు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులను తయారు చేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విద్యార్థుల శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, కార్యదర్శి టి.శ్రీనివాస్, అబ్రహాం, ఎం.లక్ష్మణరావు, డి.లక్ష్మి, షేక్ కరీం మునిషా, దేవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కడియం

మండలంలోని కడియపుసావరంలో రూ.40 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. గ్రామంలో జరిగిన గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీమేరకు నిధులు మంజూరు చేశారని ఎంపిటిసి సాపిరెడ్డి వీరదుర్గ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, సాపిరెడ్డి కామేష్, చల్లపల్లి శ్రీనివాస్, దేవానందం తదితరులు పాల్గొన్నారు .

కార్టూ'నిజం'



దీనికి బటన్ నొక్కడం కుదర్దంటే వినిపించుకోరేం..!!

రెండు పుస్తకాల ఆవిష్కరణ

దేవరపల్లి : సామాజిక విశ్లేషకులు, కాలమిస్ట్ సుంకవల్లి సత్తిరాజు రాసిన 'సాంకేతిక వల వరమా? శాపమా?', 'ప్రేమే నేరమోనా!' అనే పుస్తకాలను మంగళవారం ఆవిష్కరించారు. యర్నగూడెం పంచాయితీ కార్యాలయ సెక్రటరీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చత్రపతి శివాజీ, కళాశాల అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టెక్నాలజీ వల్ల ఎదురవుతున్న సమస్యలు, మానవ జీవితం సౌకర్య వంతంగా సాగడానికి టెక్నాలజీ నిర్వహిస్తున్న పాత్రను ఈ పుస్తకాల్లో వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఊబా చంద్రరావు, సెక్రటరీ జి.రవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వై.నారాయణమూర్తి పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితునికి 'మానవతా' సాయం

తాళ్లపూడి : కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటూ వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తాళ్లపూడికి చెందిన తాతపూడి సిద్ధుకి మానవతా మండల శాఖ రూ.5వేల ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమంలో మండల మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు, రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, ఈసీ మెంబర్ సనపల రాజశేఖర్, కోశాధికారి సిహెచ్.ఆంజనేయులు పాల్గొన్నారు.

100 మందికి నేత్ర వైద్య పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్ : వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా మంగళవారం ధవళేశ్వరంలోని పాత గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ఉన్న పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగ్లో నిర్వహించిన వైద్య శిబిరంలో 100 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎస్.శివకుమార్ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్, హెల్త్ సూపర్వైజర్ బి.కుమార్, ఆశా వర్కర్లు పూర్ణిమ, సత్యకుమారి, సత్యవేణి, వెంకటలక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

బైర్రాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెరవలి

అజ్జరం గ్రామంలో బైర్రాజు సత్యనారాయణరాజు 22వ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులర్పించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడారు. తణుకు పరిసర మండలాల్లోని అజ్జరం, కాకరపర్రు, ఖండవల్లి, ఈలపర్రు, గోటేరు, కొత్తపాడు, వెలగదురు, మోర్త, మునిపల్లి, పెండ్యాల, దువ్వ, తేతలి తదితర గ్రామాల్లో ఫౌండేషన్ సేవలు అందిస్తుందన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రామంలో వావ్ (వరల్డ్ ఆన్ వీల్) ప్రోగ్రాంలో భాగంగా అందరికీ విద్య, ఉపాధి అవకాశాలు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారపాటి సుధ, ఫౌండేషన్ కన్వీనర్ డి.సత్తిలింగం, పార్వతీశం, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసరాజు, శివ, ప్రసాద్ వర్మ, జిఎస్ఆర్.మొహిద్దీన్, నవిత సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జగనన్న సురక్షతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎంపిడిఒ జివిఎస్కె.రాజు అన్నారు. మంగళవారం కె.సావరంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నార్ని రామకృష్ణ, డిటి కె.పద్మావతి, ఇన్ఛార్జి ఇఒపిఆర్డి రాంప్రసాద్, హౌసింగ్ ఎఇ ఎం.విక్టర్బాబు, పంచాయతీ కార్యదర్శి ఎమ్డి.హసన్జానీ పాల్గొన్నారు.

'జల జీవన్' ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి

ప్రజాశక్తి - తాళ్లపూడి

జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి ఉచితంగా కులాయి కనెక్షన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. రూ.1.97 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో తాళ్లపూడి మండలానికి మంజూరైన జలజీవన్ మిషన్ పథకం పనులకు మంగళవారం పైలాన్ ఆవిష్కరించి మంత్రి వనిత శ్రీకారం చుట్టారు. తాళ్లపూడి వచ్చిన మంత్రి వనితకు వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆర్డబ్ల్యూఎస్ డిఇ అప్పారావు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ఎఇ నూర్జహాన్ మాట్లాడుతూ ఈ పథకం కింద మండలంలోని ఏడు గ్రామాలకు మొదటి విడతలో పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా వెంకట్అనురాధ, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సుందరం ట్రస్ట్ భూముల వేలం

ప్రజాశక్తి -గోకవరం

గోకవరం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో సుందరమ్మ ట్రస్ట్ భూములు బహిరంగ వేలం దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. సుందరమ్మ ట్రస్ట్ భూములు 67.56 ఎకరాలకు సంబంధించి 2023-24 నుంచి 2028 - 29 వరకూ ఆరేళ్లపాటు ఫలసాయం పొందేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. 411సర్వే నెంబర్లో 7 ఎకరాలు రూ.1,20,500కు ఇందుకూరి విశ్వనాథరాజు, 15.62 ఎకరాలు రూ.5,61,114లకు ఉంగరాల మణిరత్నం, 25 ఎకరాలకు రూ.3,48,300 పాటి రామారావు, 8.94 ఎకరాలకు రూ.2,11,000లకి భాషపంగు రమేష్, 5 ఎకరాలకు రూ.1,25,000లకు దోసపాటి సుబ్బారావు, 6 ఎకరాలు రూ.1,11,114లకి పాటి పాండుకుమార్ వేలం దక్కించుకున్నారు. మొత్తం 67,56 ఎకరాలకి రూ.14,77,028 ఆదాయం సమకూరిందని ట్రస్ట్ అధికారులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

చోరీ కేసులో పోలీసులు మంగళవారం నిందితుని అరెస్టు చేశారు. బుట్టాయగూడెం మండలం బోతప్పగూడెం గ్రామానికి చెందిన పట్టెం కిషోర్ మెగా కంపెనీ లారీపై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పురుషోత్తపట్నంలో ఒక గదిలో ఉంటూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డాడు. నిందుతుని పోలీసులు పట్టుకుని 58 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ సిఐ ఉమామహేశ్వరరావు సిబ్బంది ఎఎస్‌ఐ సమర్పణరావు, పిసి అశోక్, మరియు అవినాష్‌ను అభినందించారు.

బైకులు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-చాగల్లు

ఊనగట్ల శివారు మెయిన్ రోడ్డుపై రెండు బైకులు ఢీకొని గ్రామానికి చెందిన గూడూరి జయ గణేష్ (18) మృతి చెందాడు. మరొకరు గాయపడగా ప్రైవేట్ హాస్పిటల్ లో వైద్య సహాయం పొందుతున్నారు. మృతుడు జయ గణేష్ చాగల్లు నుండి తన గ్రామానికి ఉనగట్ల గ్రామానికి వస్తుండగా మరో బైకు అతివేగంగా ఢీకొంది. హెచ్‌సి వి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

తోటపేట మెయిన్ రోడ్డులో సోమవారం రాత్రి ఇద్దరు ఒక మహిళ మెడలో బంగారు చైన్ లాక్కుని పరారయ్యారు. తోటపేట గ్రామానికి చెందిన సావిత్రి రామాలయానికి వెళ్లి వస్తుండగా ఆమె మెడలోని ఎనిమిది కాసుల బంగారు చైన్ లాక్కుని పరారయ్యారు. ఎస్ఐ బి.వినోద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కేసుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి మండపేట

చోరీ కేసుల్లో నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్టు డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపేట పట్టణంలో ఈ నెల 19న స్థానిక కష్ణ థియేటర్ వద్ద మోటార్ సైకిల్ డిక్కీలో పెట్టిన రూ.62,000 నగదు చోరీపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ రెండు బందాలుగా గాలింపు చేట్టారన్నారు. సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులో చిత్తూరు జిల్లాకు చెందిన పి.శరవణ, ఆర్.ప్రకాష్, వి.శామ్యూల్, ఎస్.సత్యవేలు అనుమానాస్పదంగా ఉండగా అదుపులోకి తీసుకుని విచారించారు. మండపేటతో పాటు రామచంద్రపురం, కడియం, పశ్చిమ గోదావరి జిల్లా కోడూరు, పల్నాడు జిల్లా చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, ప్రొద్దుటూరు, తమిళనాడులో వీరు చేసిన నేరాలు వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద నుండి మూడు మోటార్ సైకిళ్లు రూ.1,92,300 నగదు స్వాధీన పరుచుకున్నట్లు డిఎస్పి తెలిపారు. వీరిని చాకచక్యంగా పట్టుకున్న టౌన్ ఎస్ఐ అశోక్, ఎఎస్ఐ చిన్నారావును అభినందించి వారికి నగదు పురస్కారాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం-జి.మేడపాడు కెనాల్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. బైకును వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గాయాలకు గురయ్యారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

సక్రమంగా విధులు నిర్వహిస్తే గుర్తింపు

ప్రజాశక్తి గండేపల్లి

సక్రమంగా విధులు నిర్వహిస్తే తగిన గుర్తింపు ఉంటుందని ఎస్‌పి సతీష్ కుమార్ అన్నారు. గంజాయి కేసులో ఐదుగురు నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్, సిబ్బంది నాగేశ్వరావు, సూరిబాబుకు ఎస్‌పి రివార్డ్, ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరిని జడ్‌పిటిసి మంగతాయారుబాబు తదితరులు అభినందించారు

అందరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - సామర్లకోట

అందరూ మొక్కలు నాటాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సత్యనారాయణ అన్నారు. మంగళవారం తన పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు లేదా పెళ్లి రోజు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలరన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు, తోటకూర సాయి రామకష్ణ, టి.గంగాధర్, వింజమూరి విశ్వనాథ్, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బిసి హాస్టల్ పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని 11వ వార్డులో ఆవార్డు కౌన్సిలర్ కొవ్వాడ బేబీ అప్పన్నబాబుతో కలసి మంగళవారం పర్యటించారు.వార్డులోని బిసి హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువు కోవాలన్నారు. అనంతరం వార్డులో ఇంటింటకీ వెళ్లి పారిశుధ్య నిర్వహణ తదితర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు జంగా శాంతకుమారి, కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

చిప్కో ఉద్యమ స్వర్ణోత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ మంగళవారం చింతలూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాఠశాలలోని చెట్టుని హత్తుకుని పర్యావరణం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉడతా వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రెడిట్ సొసైటీ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



సదస్సులో మాట్లాడుతున్న శ్రీకాంత్

ఎపి బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఉభయ గోదావరి జిల్లాల మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. తాళ్లరేవు శివాలయంలో మండలంలోని పలువురు బ్రాహ్మణులకు క్రెడిట్ సొసైటీ అందిస్తున్న సేవలపై అవగాహన కలిగించారు. బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు అనుబంధంగా కొనసాగుతూ, బ్రాహ్మణుల ఆర్థిక అవసరాలు తీర్చడానికి సొసైటీ పని చేస్తుందని తెలిపారు. ఎపిలో నివసిస్తూ 18 ఏళ్లు నిండిన బ్రాహ్మణులు రూ.600 చెల్లించి సభ్యులుగా చేరవచ్చన్నారు. దీనిలో రూ.500 వాటా ధనంగానూ, సభ్యత్వం రూ.100 ఉంటుందని తెలిపారు. సభ్యులుగా చేరిన వారు నగదు డిపాజిట్ చేసుకోవడంతో పాటు వ్యక్తిగత రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. మహిళలకు డ్వాక్రా సంఘాల వంటి సేవలు క్రెడిట్ సొసైటీ ద్వారా లభిస్తాయని అన్నారు. యువకులకు రూ.రెండు లక్షల వరకు వ్యాపారాలకు రుణం అందించనున్నట్టు పేర్కొన్నారు. బ్రాహ్మణ ఉద్యోగులకు సొసైటీ ద్వారా సేవలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది సభ్యత్వం స్వీకరించినట్లు మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలూరి కాశి బాబు, శివరామకృష్ణ, భాస్కర శర్మ, బాబి, మర్ల ఫణి, హరిబాబు, శ్రవణ్ కుమార్, నాగమణి, పురుషోత్తమ అవధానులు తదితరులు పాల్గొన్నారు.

'బచ్చు'లో క్రమశిక్షణతో కూడిన విద్య

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

తమ స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహం, క్రమశిక్షణతో కూడిన బోధన ద్వారా విద్యార్థులు ఏటా ఉత్తమ ఫలితాలు సాధించ గలుగుతున్నారని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయి రామకష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్ పప్పు మాధవి దేవి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో చేర్పించిన తల్లిదండ్రులు మీ పిల్లల చదువుల విషయంలో ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక సదుపాయాలను ఉపయోగించు కోవాలన్నారు. దీనిలో భాగంగానే సమావేశంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే వివిధ పథకాలను వివరించారు. విద్యార్థులు బడి మానకుండా ఉండాలని, ప్రతి రోజూ సకాలంలో హాజరవ్వాలని కోరారు. తమ పాఠశాల చదువుతో పాటు క్రీడలల్లోనూ వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి పట్టణ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తాళ్లూరి వైకుంఠం, వి.రాజు, జి.గోవిందు కె.అరుణ, కెవివి.సత్య నారాయణ, ఎఎల్‌వి.కుమారి, కె.శ్రీనివాస్, డివిఆర్ఎన్.వల్లి అధిక సంఖ్యలో తల్లి దండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోటనందూరు

గ్రామీణ పట్టణ పేద ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్చాలని భీమవరపుకోట సర్పంచ్ జగటాల వీరబాబు అన్నారు. మంగళవారం కోటనందూరు, బొద్దవరం, కెఇ.చిన్నయ్యపాలెం, పి.కొట్టం, భీమవరపుకోటలో ఉన్న ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమీక్షా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరపుకోటలో వీరబాబు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యా రంగానికి రాష్ట్రంలో అత్యధికమైన నిధులను కేటాయించి, విద్యా దీవెన, అమ్మ ఒడి విదేశీ విద్య దీవెన, పథకాలను అందిస్తున్నారన్నారు. ఎన్నడూ లేనంత విధంగా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యా బోధన సాగిస్తున్నారని,పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎ.శ్రీనివాస్, సర్పంచులు వేగి అప్పలనాయుడు, ఎంపిటిసి కొత్తపెల్లి మాణిక్యాలరావు, విద్య కమిటీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, ఉపాధ్యాయులు ఎన్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని పెద్దాపురం డిఎస్పి లతా కుమారి పేర్కొన్నారు. సిఐ కె.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆటో డ్రైవర్లు కొందరు ప్రయాణికులు మర్చిపోయిన విలువైన సామగ్రి సైతం తిరిగి వారికి అప్పగించడంలో సేవాభావం కలిగి ఉంటారన్నారు. పాసింజర్ ఆటో నడుపుతూ కుటుంబ జీవనం సాగించే ప్రతి ఆటో డ్రైవర్ ప్రయాణికులను అందర్నీ క్షేమంగా తమ తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేయడమే కాక ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాపిక్ ఎస్.ఐ. గరగారావు, తడితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలందని వారి కోసం 'సురక్ష'

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అర్హులైనా పథకాలు రానివారి కోసం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టిందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పేర్కొన్నారు. మంగళవారం సామర్లకోట క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్షా పథకం అమలులో భాగంగా సమీక్షా సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంను విజయవంతం చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ చైర్మన్లు బొడ్డు తులసీ మంగతాయారు, గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** 11 రకాల సేవలను ఉచితంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక అంకయ్యపేటలోని సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఒ సందీప్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నీలంశెట్టి అమ్మాజీ, కట్టా రాజబాబు, పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్ర సిబ్బందిపై దివ్వేది ఆగ్రహం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట వ్యవసాయ విత్తన ఉత్పత్తి పరిశోధన క్షేత్రం పని తీరుపై రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ గోపాలకృష్ణ దివ్వేది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సామర్లకోటలోని వ్యవసాయ విత్తన పరిశోధన క్షేత్రాన్ని ఆయన జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో పలు ల్యాబ్‌లను ఆయన పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన మట్టి నమూనాల కవర్లపై ఎలాంటి వివరాలు కనిపించకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎన్ని నమూనాలు రైతుల నుంచి సేకరించారని ప్రశ్నించారు. వ్యవసాయ అధికారుల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొబైల్ భూసార పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం అందించిన వాహనాన్ని వినియోగించకుండా వదిలిపెట్టడాన్ని ప్రశ్నించారు. రైతులకు మేలు జరిగే విధంగా భూసార పరీక్షలు మరింత ఎక్కువగా చేయాలని సూచించారు. అనంతరం ఉండూరులోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. (జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ ఎడిఎలు భాస్కరరావు, పద్మశ్రీ, రత్న ప్రశాంతి, మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిశెట్టి సత్య, ఎఇఒలు పాల్గొన్నారు.

జగనన్న లే ఔట్లలో సదుపాయాల కల్పన

ప్రజాశక్తి-పెదపూడి

జగనన్న కాలనీల లేఅవుట్లలో త్వరలో డ్రెయిన్లు, రోడ్లు, తాగునీరు సదుపాయాలు త్వరలో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి గోపాలకృష్ణ ద్వివేది చెప్పారు. జి.మామిడాడ గ్రామంలోని జగనన్న హౌసింగ్ లేఔట్‌న్ ఆయన, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తదితరులు మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి టిడిపి మినీ మేనిఫెస్టో

ప్రజాశక్తి కాకినాడ రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు మహానాడులో విడుదల చేసిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళతామని రూరల్ మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం వలసపాకల గ్రామంలోని తమ స్వగృహంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. మినీ మానిఫెస్టోను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'వస్తున్నా మీ గ్రామానికి మీ అనంత లక్ష్మి' కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాల కరపత్రాలతో ప్రతి ఇంటిని సందర్శిస్తామన్నారు. ఈ నెల 29 నుండి కరప మండలం కొంగోడులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

పలువురికి గుండె వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కోటనందూరు

మండల కేంద్రమైన కోటనందూరులో మోహన్ డాక్టర్ ఆధ్వర్యంలో విశాఖపట్నంకు చెందిన కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య 70 మందికి ఉచితంగా గుండె వైద్య పరీక్షలను నిర్వహించారు. బిసి, సుగర్, ఇసిజి టూడాట్ ఎకో టెస్టులను ఉచితంగా నిర్వహించారు. అల్లిపూడి, కాకరాపల్లి, కోటనందూరు బిహెచ్.కోట, జగన్నాథపురం, తాటిపాక గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండల అభివృద్ధి కార్యాలయంలో డ్వాక్రా సమాఖ్య సంఘాల యానిమేటర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా సిఎం జగన్ పనిచేస్తున్నారని ఆదిశ గా మహిళ సమైక్య సంఘాలు బలోపేతం కావాలన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి చెందితే మండల స్థాయిలో మహిళా మాల్స్ ఏర్పాటు చేసేఅవకాశం ఉందన్నారు. సమావేశంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య, కోశాధికారి వాసంశెట్టిపద్మారెడ్డి, డిఆర్‌డిఎ ఎపిఎం నాగరాజు, క్లస్టర్ కోఆర్డినేటర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో తప్పనిసరిగా ప్రభుత్వం ఆదేశించిన మెనూ పాటించాలని రామచంద్రపురం డివైఇఒ పి.శాలెం రాజు అన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల నుండి వివరాలు సేకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎండిఎం సిబ్బందికి సూచనలు చేశారు. పాఠశాల్లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రామలక్ష్మణ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తపేట

నియోజకవర్గంలో సుమారు 17 వేల మందికి పైగా ఇళ్ల పట్టాలు అందజేశామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం అవిడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొని సుమారు800 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మార్గన గంగాధర్‌రావు, జెడ్‌పిటిసి సభ్యుడు గూడపాటి రమాదేవి, గొల్లపల్లి డేవిడ్ రాజ్, గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి, ముత్యాల వీరభద్రరావు, బి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సొమ్ముల కోసం అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ

అగ్రిగోల్డ్ బాధితులకు సొమ్ములు చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సువార్త పాల్ అధ్యక్షతన కాకినాడ గాంధీ భవన్‌లో మంగళవారం అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులందరూ సామాన్య, మధ్యతరగతి ప్రజలని, వారు కాయకష్టం చేసి దాచుకున్న సొమ్ములన్నారు. వైసిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా ఇచ్చి ఎన్నికల్లో గద్దెనెక్కి, నాలుగేళ్ల గడుస్తున్నా బాధితుల సమస్యల పరిష్కరించడంలో విఫలం అయిందన్నారు. 2024 ఎన్నికల్లో లోపు అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ రూపంలో ఉన్న సొమ్మును చెల్లించాలని లేకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను మాజీ సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జనసేన పార్టీ నేత ఆకుల శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దాట్ల గాంధీ రాజు, ఆర్‌పిఐ నాయకుడు పిట్టా వరప్రసాద్, కాల్లూరి కష్ణమోహన్, తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎస్‌పికి 12 వినతులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఏర్పాటు చేసిన డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. మొదటి రోజు 13 వినతులు రాగా ఈ సమస్యల పరిష్కారానికి ఎస్‌పి తక్షణం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమస్యలు విన్నవించుకునేందుకు మంగళవారం బాధితులు 0884- 2371744 నంబర్‌కు చేసి ఫిర్యాదు చేయాలన్నారు.



రోగులతో మాట్లాడుతున్న గోపాలకృష్ణ దివ్వేది

ఆసుపత్రిలో ద్వివేది తనిఖీలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించిందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ గోపాల కృష్ణ దివ్వేదీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సిహెచ్‌సిని ఆయన కలెక్టర్ కృతికా శుక్లా తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని, రోగులకు మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వార్డులో చికిత్స పొందుతున్న పేషంట్లను సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల పట్ల ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా,డిసిహెచ్ఎస్ డాక్టర్ విష్ణువర్ధిని, సూపరింటెండెంట్ డాక్టర్ అమల, డాక్టర్లు శ్రీదేవి, సంతోషలక్ష్మి, సమంత పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెదబ్రహ్మదేవం గ్రామంలో ప్రముఖ బిఎఎస్ఎఫ్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు పి.గోపాల కష్ణ మాట్లాడుతూ సస్యరక్షణ చర్యలు అవలంబించక పోవడం, అవగాహన లేకపోవడం వల్ల అధిక దిగుబడి పొందలేక నష్టపోతున్నారన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ రంగంలో జరుగుతున్న నూతన పద్ధతులు తెలుసుకుని అనుసరించడం ద్వారా మెరుగైన పలితాలు పొందవచ్చునన్నారు. వరిలో నూతన ఆవిష్కరణ అయిన ఫేసెట్ అనే మందును ఏకరాకు 400మి.లి. చొప్పున వాడుకోవాలన్నారు. నాట్లు వేసే వరిలో కూడా వాడుకోవచ్చున్నారు. ఈ సదస్సులో అవినాష్, మండవిల్లి వెంకటరావు, సిహెచ్‌వి.జనార్ధన రావు, కె.చిట్టిబాబు, తోటకూర సూర్య ప్రభాకర రావు, పడాల లక్ష్మణ రావు, పెంటపాటి బుజ్జి, పెదబ్రహ్మదేవం, మేడపాడు గ్రామాల రైతులు హాజరయ్యారు.

ఆలయాలు, మసీదులకు భద్రత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లోనూ, మసీదుల్లోనూ ప్రశాంత వాతావరణంలో ప్రార్థన నిర్వహించుకునేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్‌పి సతీష్ కుమార్ పేర్కొన్నారు. తొలి ఏకాదశి, బక్రీద్ రెండు పండుగలు ఒకే రోజున రావడంతో ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. వివిధ మతాల కులాల సమ్మేళనంతో భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉండాలన్నారు. సంప్రదాయాలను ప్రతి ఒక్కరు గౌరవించి ఇతరుల మనోభావాలకు భంగం కలిగించకుండా ప్రతి ఒక్కరూ మెలగాలన్నారు. సోషల్ మీడియాలో ఏ విధమైన పుకార్లు వదంతులు ప్రచారం చేయొద్దని సూచించారు.

యానాం వార్తలు

29న యువ ఉత్సవం-2023

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ క్రీడా,యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర యానాం ఆధ్వర్యంలో ఈనెల 29న గురువారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జిల్లాస్థాయి యువ ఉత్సవం 2023 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి తెలిపారు. ఈ సందర్భంగా తిర్రి గోపి, మన్నే కిరణ్ మంగళవారం ఆర్ఎఒ మునిస్వామి ఉత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువ ఉత్సవంలో భాగంగా డ్రాయింగ్, కవిత్వం, కల్చరల్, మొబైల్ ఫోటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి రాజ్యసభ సభ్యులు సెల్వ గణపతి, విశిష్ట అతిథులుగా స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

హెలెన్ కెల్లర్ 143వ జయంతి ఉత్సవాలను చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బీచ్ రోడ్ లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ముందుగా హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ తన జీవితాంతం వికలాంగుల సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయకుమారి, సుశీల, మహేశ్వరీ, చైల్డ్ లైన్ సిబ్బంది జివివిఎస్ తాతారావు, కె.దేవి, శ్రీదేవి, హెచ్.నూకరత్నం, ఎన్.విజయలక్ష్మి, ఎం.గీత పాల్గొన్నారు.

గోడ కూలి బైక్ ధ్వంసం

ప్రజాశక్తి - యానాం

స్థానిక యానాం ఫైర్ స్టేషన్ ప్రక్కనున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ ప్రహరీ గోడ కూ ఒక బైక్, సైకిల్ ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. దరియాలతిప్ప గ్రామానికి చెందిన పులపకూర భైరవమూర్తి తన బైక్‌పై పత్తిగొందు గ్రామానికి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు.